పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పూర్వ విద్యార్థులు

రామవరం, జనవరి 18: వారిది అర్ధ శతాబ్దపు స్నేహం. 'స్నేహమేరా జీవితం... స్నేహమేరా శాశ్వతం..' అని నమ్మిన పాత తరం విద్యార్థులు వాళ్లు. సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని రుద్రంపూర్ సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాలకు చెందిన 1974-75 విద్యాసంవత్సరానికి చెందిన పదోతరగతి విద్యార్థులు.. దాదాపు 50 ఏళ్ల తర్వాత అదే పాఠశాలలో శనివారం ఆత్మీయ సమ్మేళనం జరుపనుకున్నారు. నాటి స్మృతులు నెమరువేసుకున్నారు. మొత్తం 41 మందిలో తొమ్మిది మంది గతించారని, విదేశాల్లో ఉన్న ఆరుగురు సహా కొందరు మాత్రమే రాలేదని ఈ సమ్మేళన నిర్వాహకుడైన సింగరేణి మాజీ పర్సనల్ జీఎం పసుపులేటి శ్రీనివాస్ చెప్పారు. ప్రిన్సిపాల్ బ్రదర్ రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయుడు జార్జిరెడ్డి, పూర్వ విద్యార్థులు వసుంధర-సుమంగళి శంకర్‌బాబు, ప్రేం, రవిశంకర్, రత్న కుమార్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

'ఆలపాటి'కి పలువురు ప్రముఖులు పరామర్శ

'ఆలపాటి'ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే 'మెచ్చా'

అశ్వారావుపేట, జనవరి 18: సీనియర్ రాజకీయ నాయకుడు ఆలపాటి రామ్మోహన్‌రావు (రాము)ను పలువురు పరామర్శించారు. రాము అత్తయ్య సత్యావతి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. శనివారం జరిగిన ఆమె దశదిన కర్మకు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, మాజీ డీసీసీబీ డైరెక్టర్ తుళ్ళూరి బ్రహ్మయ్య, నాయకులు మట్టా దయానంద్ హజరై సత్యావతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

దొంతికుంట చెరువును ఆధునీకరిస్తాం..

అశ్వారావుపేట టౌన్, జనవరి 18: ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోని అశ్వారావుపేట దొంతికుంట చెరువును ఆధునీకరిస్తామని నీటిపారుదల శాఖ రాష్ట్ర చైర్మన్ మువ్వా విజయబాబు అన్నారు. శనివారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలసి దొంతికుంట చెరువును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. దొంతికుంట చెరువుకు ప్రత్యేకత ఉందని, అటువంటి చెరువు నేటి నిరాదరణకు గురికావటం బాధాకరమన్నారు. వీరి వెంట స్థానిక నాయకులు సుంకవల్లి వీరబద్రరావు, తుమ్మ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట మండలంలో ఎమ్మెల్యే పర్యటన

భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జారే

దమ్మపేట, జనవరి 18: మండలంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శనివారం విస్తృతంగా పర్యటించారు. రూ.3.66 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మండల పరిధిలోని గండుగులపల్లి జడ్పీహెచ్ఎస్‌లో వంటషెడ్, కాంపౌండ్ వాల్, ఎంపీపీఎస్ పాఠశాలలో సీసీ రోడ్డు, కాంపౌండ్ వాల్ పునఃనిర్మాణం ఏకలవ్య పాఠశాలలో క్వార్టర్ పనులకు శంకుస్థాపన చేశారు. పట్వారిగూడెం, దమ్మపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

అభివృద్ధికే పెద్ద పీట

అశ్వారావుపేట, జనవరి 18: అభివృద్ధి, ప్రజా సంక్షేమానికే ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ స్పష్టం చేశారు. 'పేట' మున్సిపాలిటీపై గెజిట్ విడుదల కావడంతో శనివారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు.

జాతీయ స్థాయిలో రాణించాలి

అశ్వారావుపేట (ములకలపల్లి), జనవరి 18: సైన్స్ ఫేర్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన ఇనుకుర్తి ప్రణీత్ జాతీయ స్థాయిలోనూ రాణించాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆకాక్షించారు. త్వరలోనే 2 ఎకరాల్లో సేంద్రియ పద్ధతిలో పంటల సాగుపై రైతులకు ప్రణీత్‌తో అవగాహన సదస్సు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఇందుకు ప్రణీత్ కూడా సిద్ధంగా ఉండాలని సూచించారు. ములకలపల్లి మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన ఇనుకుర్తి ప్రణీత్ రాష్ట్ర స్థాయి సైన్స్ ఫేర్‌లో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ మేరకు శనివారం ప్రణీత్‌ను శాలువాతో సత్కరించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం అర్బన్, జనవరి 18: కొత్తగూడెం 27వ వార్డులోని ప్రగతి మైదానంలో ఎంపవర్‌మెంట్ సెంటర్ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శనివారం శంకుస్థాపన చేశారు. మున్సిపల్ చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మి, కమిషనర్ శేషాంజన్ స్వామి, తహసీల్దార్ పుల్లయ్య, డీఈ రవీందర్, కౌన్సిలర్లు కంచర్ల జమలయ్య, ప్రసాద్‌బాబు, భూక్యా శ్రీనివాస్, ధర్మరాజు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పాల్వంచ రూరల్, జనవరి 18: పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జూనియర్ కళాశాలల జిల్లా స్థాయి క్రీడాపోటీలు శుక్రవారం జరిగాయి. విజేతలకు బహుమతి ప్రదానోత్సవం శనివారం జరిగింది. బహుమతులను ఎమ్మెల్యే ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రదానం చేశారు. ఇంటర్‌మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి వెంకటేశ్వరావు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పద్మ, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రిన్సిపాల్స్ శేషుబాబు, శంకర్, రమేష్, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ యుగంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాములు మృతికి నివాళి

ఇల్లెందు రూరల్, జనవరి 18: ఇల్లెందు మండల పరిధిలోని సూదిమల్ల గ్రామ పంచాయతీకి చెందిన చీమ రాములు ఇటీవల ఆనారోగ్యంతో మృతిచెందాడు. శనివారం వారి స్వగృహంలో జరిగిన దశదిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బాణోత్ హరిప్రియ హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. దాస్యం ప్రమోద్, రాజేష్, రాజశేఖర్, నాగేందర్ పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

కార్మికులకు సౌకర్యాల కల్పనలో ఐటీసీ విఫలం

బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గంజి రాంబాబు

మాట్లాడుతున్న గంజి రాంబాబు

బూర్గంపహాడ్, జనవరి 18: ఐటీసీ లాభాల్లో ఉన్నా.. కార్మికులకు సౌకర్యాలు కల్పించడంలో ఘోరంగా విఫలమైందని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గంజి రాంబాబు విమర్శించారు. శనివారం రాత్రి సారపాకలో ఈస్ట్ గేట్ వద్ద బీఆర్‌టీయూ మిత్రపక్షాల ఎన్నికల కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి బీఆర్‌టీయూ ఎన్నికల మేనిఫెస్టోను ఆవిష్కరించారు. బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సానికొమ్ము శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌టీయూ మిత్రపక్షాలను గెలిపిస్తే బదిలీ కార్మికులను రెగ్యులర్ చేయిస్తామని, 31న జరిగే గుర్తింపు సంఘం ఎన్నికల్లో బీఆర్‌టీయూ మిత్రపక్షాలకు ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించాలని కోరారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ మాట్లాడుతూ.. టీఎన్‌టీయూసీ, ఐఎన్‌టీయూసీ యూనియన్లను గెలిపించడం వల్ల కార్మికులకు ఎలాంటి న్యాయం జరగదని, ఐటీసీ ట్రేడ్ యూనియన్లలో మార్పు రావాలని, బీఆర్‌టీయూ మిత్రపక్షాలతోనే మార్పు సాధ్యమన్నారు. ఏజే రమేష్, మానే రామకృష్ణ, రావులపల్లి రాంప్రసాద్, వెంకటేశ్వర్లు, అజీమ్, సాబీర్, నర్సింహారావు, మధుమహరాజ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా సర్వే

సర్వేను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో నాగలక్ష్మి

జూలూరుపాడు, జనవరి 18: మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను జడ్పీ సీఈవో నాగలక్ష్మి శనివారం పరిశీలించారు. ఎంపీడీవో కరుణాకర్‌రెడ్డి, ఎంపీవో తులసీరామ్, పంచాయతీ కార్యదర్శి జ్యోతి పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి, జనవరి 18: వ్యవసాయం యోగ్యం కాని భూములకు రైతు భరోసా రాదని తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్ అన్నారు. శనివారం మండలంలో రెవెన్యూ, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సాగుకు యోగ్యం కాని భూముల సర్వేను ఆయన పరిశీలించారు. సాగు యోగ్యం కాని భూముల వివరాలను ఏవో అనూషను అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ, వ్యవసాయశాఖల సిబ్బంది పాల్గొన్నారు.

అశ్వారావుపేట టౌన్, జనవరి 18: ప్రభుత్వం ప్రారంభించిన రైతు భరోసా పథకంపై సర్వే అశ్వారావుపేట రెవెన్యూ పరిధిలో శనివారం అధికారులు ఉమ్మడి సర్వే ప్రారంభించారు. వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖల అధికారులు సమష్టిగా నిర్వహిస్తున్న సర్వేలో మండలంలో ఇప్పటి వరకు 60 రైతు భరోసాకు వర్తించని భూములను గుర్తించినట్లు తెలుస్తున్నది. సర్వేలో ఏవో శివరామప్రసాద్, ఆర్ఐ తాటి కృష్ణ, ఏఈవో సతీష్ తదితరులు ఉన్నారు.

అశ్వారావుపేట రూరల్, జనవరి 18: మండల పరిధిలోని నారాయణపురం, ఆసుపాక, తిరుమలకుంట, నారంవారిగూడెం, మల్లాయిగూడెం, ఖమ్మంపాడు, వేదాంతపురం గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో రెవెన్యూ, వ్యవసాయ, ఉపాధి హామీ అధికారులు వేర్వేరుగా సర్వే చేపట్టారు. అనంతరం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారుల జాబితా ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సర్వే తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఏవో శివరాంప్రసాద్ పర్యవేక్షించగా ఆర్ఐ పద్మావతి, కృష్ణ, సర్వేయర్ నాగరాజు, ఏఈవో షాకీరాభాను, సాయి, రవీంద్ర, కార్యదర్శులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం, జనవరి 18: ప్రభుత్వ పథకాల అమలు కోసం జరుగుతున్న సర్వే శనివారం మండలంలో కొనసాగింది. సర్వే డేటాను తహసీల్దార్ కార్యాలయంలో ఏడీఏ సుధాకర్‌రావు పరిశీలించారు. మండలంలో ఐదు కమిటీల ఆధ్వర్యంలో ఈ సర్వే జరిగిందని వ్యవసాయాధికారి నవీన్‌కుమార్ ఆయనకు తెలిపారు.

మణుగూరు టౌన్, జనవరి 18: ప్రభుత్వం ఈ నెల 26వ తేదీ నుంచి అమలు చేయనున్న రైతు భరోసాలో భాగంగా అర్హులైన రైతుల జాబితాను తయారు చేసేందుకు అధికారులు సంసిద్ధులవుతున్నారు. శనివారం మండల వ్యాప్తంగా అధికారులు పంట పొలాలు, సాగు చేస్తున్న పొలాలను జాబితా ఆధారంగా పరిశీలన చేశారు. మణుగూరు అశోక్‌నగర్‌లో ఏఈవో లక్ష్మణరావు వెరిఫికేషన్ చేయగా, మణుగూరు మండలం రామానుజవరం రెవెన్యూ గ్రామ పరిధిలో రైతు భరోసాను తహసీల్దార్ రాఘవరెడ్డి, వ్యవసాయ అధికారులు పరిశీలన చేశారు.

ఏడాది క్రితం ఇదే తరహాలో గుర్తించిన పోలీసులు

12 అడుగుల లోతులో ఒకేసారి ఐదుగురు పట్టగలిగే విస్తీర్ణంలో సొరంగాలు

మావోయిస్టుల సొరంగాలు గుర్తింపు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, జనవరి 18 : భద్రతా దళాలు ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో భారీ సొరంగ మార్గాలను గుర్తించారు. రెండు రోజుల క్రితం దండకారణ్యంలో జరిగిన ఎదురుకాల్పుల అనంతరం వెనుదిరిగిన భద్రతా దళాలు వీటిని గుర్తించి ఆశ్చర్యపోయారు. ఇప్పుడు ఆ రాష్ట్రంలో ఇది చర్చనీయాంశంగా మారింది. భద్రతా దళాలను ఎదుర్కొనేందుకు మావోయిస్టులు వ్యూహా ప్రతివ్యూహాలు రచిస్తూ.. కొత్త కొత్త పథకాలను రూపొందిస్తున్నారు. మావోయిస్టులకు ముంచుకొస్తున్న 'కగార్' ముప్పు నుంచి తప్పించుకుంటూనే ప్రతిదాడులకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో ఎన్నడూ లేని విధంగా అడవుల్లో సొరంగ మార్గాలను మావోయిస్టులు ఏర్పాటు చేసుకుంటున్నారు. గత ఏడాది జనవరి 30వ తేదీన సుక్మా జిల్లాలో హిద్మా సైన్యం జవాన్ల క్యాంపుపై చేసిన మెరుపు దాడిలో ముగ్గురు జవాన్లు మృతి చెందారు. దీంతో మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో భారీగా మోహరించిన భద్రతా దళాలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపడుతున్న క్రమంలో మావోయిస్టులు ఏర్పరుచుకున్న సొరంగ మార్గాలు బయటపడ్డాయి. అప్పట్లో ఆ వీడియోలు సైతం వైరల్‌గా మారాయి. తిరిగి దాదాపు అదే సమయానికి ఈ నెల 16వ తేదీన బీజాపూర్ జిల్లా సరిహద్దు పూజారీ కాంకేర్ అడవుల్లో సుమారు 3 వేల మంది భద్రతా దళాలు నిర్వహించిన సెర్చింగ్ ఆపరేషన్‌లో భాగంగా జరిగిన ఎదురు కాల్పుల్లో పీఎల్‌జీఏ 1వ నెంబర్ ప్లాటూన్‌కి చెందిన 16 మంది మావోయిస్టులు నేలకొరిగారు. ఈ ఆపరేషన్ ముగించుకుని తిరుగుబాట పట్టిన భద్రతా దళాలు మార్గమధ్యంలో సుమారు 12 అడుగుల లోతులో ఒకేసారి ఐదుగురు పట్టగలిగే విస్తీర్ణంలో సొరంగాలను గుర్తించాయి. వాటిని మావోయిస్టులు జీజీఎల్ షెల్స్, ఐఈడీలను తయారు చేసేందుకు వినియోగిస్తున్నట్లు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పాటిలింగం ధ్రువీకరించారు. ఈ ప్రాంతం అత్యంత ప్రమాదకరంగా ఉన్నప్పటికీ తమ బలగాలు అక్కడికి చొచ్చుకెళ్లి మావోయిస్టులకు అత్యంత సౌకర్యవంతమైన స్థావరాలను ధ్వంసం చేసినట్లు తెలిపారు. సుక్మా జిల్లా డీఆర్‌జీ జవాన్లు తుమ్రెల్, తాల్పేర్ నదికి సమీపంలో ఈ సొరంగాలను గుర్తించినట్లు ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం మావోయిస్టులు ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న క్రమంలో ఆపరేషన్ కగార్ మరింత వేగంగా దూసుకుపోతున్నది. వేల సంఖ్యలో భద్రతా దళాలు దండకారణ్యాన్ని చుట్టుముట్టి గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి.

ఎల్ అండ్ టీ చైర్మన్ వ్యాఖ్యలు విరమించుకోవాలి

మాట్లాడుతున్న భూపాల్

భద్రాచలం, జనవరి 18: ఎల్అండ్‌టీ కంపెనీ చైర్మన్ సుబ్రహ్మణ్యం చేసిన వ్యాఖ్యలు కార్మిక వర్గం మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయని, వెంటనే వ్యాఖ్యలు ఉపసంహరించకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి దిగుతామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ హెచ్చరించారు. శనివారం భద్రాచలం చందర్‌రావుభవన్‌లో జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. తక్షణమే ఆ వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులతో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఏజే రమేష్, వై.వెంకటరామారావు, బండారు శరత్‌బాబు, నకిరికంటి నాగరాజు, లక్ష్మణ్, సురేందర్, గంగ, సంతోష్, రవి, రమ, నరేందర్ పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

గంజాయి, నిందితులను చూపుతున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు

భద్రాచలం, జనవరి 18: ఒరిస్సా నుంచి ఉత్తరప్రదేశ్ బాండా జిల్లాకు కారులో అక్రమంగా తరలిస్తున్న 31.06 కిలోల గంజాయిని శనివారం భద్రాచలం సమీపంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు పట్టుకున్నారు. బాండా జిల్లాకు చెందిన అంజనీకుమార్, సంజీవ్‌కుమార్ ఇన్నోవా కారులో గంజాయి తీసుకు వస్తున్నారన్న సమాచారం అందడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు భద్రాచలం చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహించి కారును పరిశీలించగా రూ.11 లక్షల విలువైన గంజాయి ఉన్నట్లు గుర్తించారు. గంజాయితో పాటు ఇద్దరు వ్యక్తులు, రెండు సెల్‌ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. దాడుల్లో సీఐ సీహెచ్ శ్రీనివాస్, హెడ్‌కానిస్టేబుళ్లు ఎంఏ కరీం, కానిస్టేబుల్ సుధీర్, వెంకటేశ్వర్లు, హరీష్, విజయ్, ఆనంద్, హనుమంత్, ఉపేందర్ పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు స్వర్ణ తులసి పూజలు

భద్రాచలం, జనవరి 18: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామివారి ఉత్సవమూర్తులకు శనివారం అర్చకులు స్వర్ణతులసి పూజలు జరిపారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు చేశారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణమూర్తులను బేడా మండపానికి తీసుకువచ్చి కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న జంటలకు ప్రాసాదాలు అందజేశారు.

పర్ణశాలకు పోటెత్తిన భక్తులు

పర్ణశాల, జనవరి 18: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాలకు శనివారం భక్తులు భారీగా పోటెత్తారు. సంక్రాంతి సెలవులు కావడంతో దూర ప్రాంతాల నుంచి యాత్రికులు భద్రాచలం రాములవారిని దర్శించుకొని అనంతరం పర్ణశాల రామున్ని కూడా దర్శించుకుంటున్నారు. రామాలయానికి అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ అధికారులు భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

క్యాంపస్ సెలక్షన్‌లో 69 మందికి ఉద్యోగాలు

భద్రాచలం, జనవరి 18: భద్రాచలం పట్టణంలోని మారుతి నర్సింగ్ కళాశాలలో జీఎన్ఎం నర్సింగ్ కోర్సు పూర్తి చేసిన 69 మంది క్యాంపస్ సెలక్షన్‌లో హైదరాబాద్‌లోని ఓమెగా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్‌లో 32, కిమ్స్ ఆసుపత్రి సికింద్రాబాద్‌లో 17, భాస్కర మెడికల్ కాలేజ్ హాస్పటల్ హైదరాబాద్‌లో 20 మంది మొత్తం 69 మంది ఉద్యోగ నియామకాలు పొందినట్లు మారుతి కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఎస్ఎల్ కాంతారావు, చైర్మన్ బి.సుబ్బరాజు శనివారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులను వారు అభినందించారు.

బయో మందులు అతిగా వాడొద్దు..

మిర్చి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ లాల్‌చంద్

టేకులపల్లి, జనవరి 18: మిర్చి పంటలకు విపరీతంగా బయో మందులు వాడడం వల్ల త్వరగా పెరిగి తెగుళ్లు వచ్చినప్పుడు తట్టుకోలేకపోతున్నాయని ఇల్లెందు వ్యవసాయశాఖ ఏడీఏ లాల్‌చంద్ అన్నారు. శనివారం మండలంలోని మద్రాస్ తండాకు చెందిన పూనెం వెంకయ్య మిర్చి తోటను ఏవో అన్నపూర్ణ, ఏఈవోతో కలిసి పరిశీలించారు. ఆయన రైతులతో మాట్లాడుతూ.. అవసరం ఉంటేనే తోటకు బయో మందులు వాడాలని, ఎక్కువ సార్లు బయో మందులు స్ప్రే చేయడం వలన మిర్చికి తెగుళ్ళు వస్తే తట్టుకునే శక్తి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఏవో అన్నపూర్ణ, ఏఈవోలు శ్రావణి, ప్రవీణ్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

ఇల్లెందు, జనవరి 18: ఇల్లెందు పట్టణంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కమిషనర్ శ్రీకాంత్ శనివారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. అంకు షావలి, మురళి, సదానందం, రవి, పద్మావతి, ఆజాం, వీణ, సుజాత, శంకర్ పాల్గొన్నారు.

పోలీస్ స్పోర్ట్స్ మీట్‌కు ఎంపిక

క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ

కొత్తగూడెం ప్రగతి మైదాన్, జనవరి 18: ఈ నెల 28న కరీంనగర్‌లో జరుగనున్న తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ జోనల్ మీట్స్‌కు జిల్లా నుంచి సిబ్బందిని అధికారులు ఎంపిక చేశారు. ఈ ఎంపిక పోటీలను కొత్తగూడెం సింగరేణి ప్రకాశం మైదానంలో శనివారం కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ జెండా ఊపి ప్రారంభించారు.

కొండాయిగూడెంలో ఆర్‌వో ప్లాంట్ నిర్మాణం

మణుగూరు టౌన్, జనవరి 18: మణుగూరు రామానుజవరం పంచాయతీలోని కొండాయిగూడెం హెల్త్ సబ్ సెంటర్ వద్ద సింగరేణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న గంటకు 225 లీటర్ల సామర్థ్యం ఉన్న ఆర్‌వో వాటర్ ప్లాంట్ గ్రామ ప్రజల జీవితాల్లో విప్లవాత్మక మార్పు తీసుకురానుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన టెండర్ల ప్రక్రియను సింగరేణి యాజమాన్యం విజయవంతంగా పూర్తి చేసి రెండు నెలల్లో పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు.

ఫారెస్ట్ స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అశ్వాపురం, జనవరి 18: బండ్ల వారిగుంపు బీట్ పరిధిలో ఏర్పాటు చేయనున్న ఫారెస్ట్ స్టేషన్ స్థలాన్ని ఫారెస్టు డివిజనల్ అధికారి సయ్యద్ మసూద్ మోహిద్దీన్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అడవుల్లో చెలరేగే మంటలను ఆర్పేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఫేర్ బ్లోజర్‌తో డెమో క్లాస్ నిర్వహించారు. అనంతరం బండ్లవారిగుంపు బీట్ పరిధిలో ఉన్న ప్లాంటేషన్‌ను పరిశీలించారు. రేంజర్ రమేష్, డీఆర్‌వో వెంకట్రావు, బీట్ ఆఫీసర్లు జుమికిలాల్, లక్ష్మణ్, రమేష్, సురేష్, సునీల్, స్థానికులు బొర్రా శ్రీను, సిద్ధులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

కొత్తగూడెం ఎడ్యుకేషన్, జనవరి 18: గ్రూప్-1/2/3/4, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్, సాఫ్ సెలక్షన్ కమిషన్, బ్యాంకింగ్ తదితర పోటీ పరీక్షలకు నాలుగు నెలల బేసిక్ ఫౌండేషన్ కోర్సులో ఉచిత శిక్షణకు జిల్లాలోని అర్హులైన మైనార్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులనరు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి సంజీవరావు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు గడువు ఫిబ్రవరి 15వ తేదీ వరకు ఉందని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు జతపర్చిన ధరఖాస్తులను నూతన కలెక్టర్ ఆఫీస్ భవన సముదాయంలో ఇవ్వవచ్చని పేర్కొన్నారు. మరింత సమాచారానికి 9553491432, 7013081175 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు.

బెల్టు దుకాణాలను తొలిగించాలి

అశ్వారావుపేట, జనవరి 18: అశ్వారావుపేట నియోజకవర్గంలో అనధికారికంగా నిర్వహిస్తున్న బెల్టు దుకాణాలను ఎత్తివేయాలని మహిళా మండలి జిల్లా అధ్యక్షురాలు షేక్ జాన్ బీ ఎక్సైజ్ అధికారులను డిమాండ్ చేశారు. స్థానిక ఎక్సైజ్ స్టేషన్లో శనివారం బెల్టు దుకాణాలను తొలగించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తంబళ్ళ రవి, వాసం పోలయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులారా.. ఆడుదాం రండి..!

కొత్తగూడెం గణేష్ టెంపుల్, జనవరి 18: ఆలిండియా సివిల్ సర్వీసెస్ రాష్ట్ర స్థాయి టోర్నమెంట్స్‌ను ఈ నెల 23, 24 తేదీల్లో హైదరాబాద్‌లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ నిర్వహిస్తుందని జిల్లా యువజన, క్రీడల అధికారి పరంధామ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మరింత సమాచారానికి 98499 13068 ను సంప్రదించవచ్చని కోరారు.

మృతదేహం లభ్యం

పినపాక, జనవరి 18: మండలంలోని ఎర్రగుంట కాలనీ సమీపంలో శనివారం ఓ మృతదేహాన్ని ఏడూళ్ళబయ్యారం పోలీసులు గుర్తించారు. హెడ్ కానిస్టేబుల్ మల్చూర్ తెలిపిన వివరాల ప్రకారం.. మణుగూరు మండలం పగిడేరు గ్రామానికి చెందిన కుంజ నరేష్ (35) మద్యానికి బానిసయ్యాడు. వారం రోజుల క్రితం ఎర్రగుంట సమీపంలోకి వచ్చి మృతిచెందాడు. శనివారం పశువుల కాపరులు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు సోదరుడు సారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎస్ఎఫ్ఐ కరపత్రం ఆవిష్కరణ

జూలూరుపాడు, జనవరి 18: ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు ఫిబ్రవరి 4-5 తేదీల్లో పాల్వంచ పట్టణంలో జరగనున్నాయి. వీటి ప్రచార కరపత్రాన్ని జిల్లా కమిటీ సభ్యుడు రామ్‌చరణ్ శనివారం జూలూరుపాడులో ఆవిష్కరించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ